క్లుప్తంగా

ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి



మాట్లాడుతున్న కృష్ణారావు

ఖమ్మం మామిళ్లగూడెం: రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని ఫోరమ్ రాష్ట్ర స్టీరింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ వీవీ కృష్ణారావు పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం, నిజమైన తెలంగాణ ఉద్యమకారులను గుర్తించడానికి ఒక కమిటీ ఏర్పాటు చేయాలని తెలిపారు. అమరవీరుల స్తూపం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో బచ్చల పద్మచారి, పెళ్లూరి విజయ్‌కుమార్, నేలవెల్లి వెంకటేశ్వరరావు, భూక్యా రాంబాబునాయక్, అర్వపల్లి విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

ఏడాది పాటు హనుమాన్ చాలీసా



హనుమాన్ చాలీసా పఠిస్తున్న భక్తులు

ఖమ్మంగాంధీచౌక్: జిల్లాలో ఏడాది పాటు హనుమాన్ చాలీసా, గోవింద నామాల భజన కార్యక్రమాలను నిర్వహించాలని విశ్వ హిందూ పరిషత్ జిల్లా శాఖ నిర్ణయించి ఆదివారం నగరంలోని ఎన్ఎస్‌పీ రామాలయంలో ప్రారంభించారు. జిల్లాలోని ప్రతీ ఇంట్లో హనుమాన్ చాలీసా, గోవింద నామాల పారాయణం జరగాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్నట్లు వీహెచ్‌పీ ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా 250 మంది భక్తులు పాల్గొని హనుమాన్ చాలీసా, గోవింద నామాలను స్మరించారు. ఈ కార్యక్రమంలో విశ్వ హిందూ పరిషత్ ప్రతినిధులు బోనాల రామకృష్ణ, బొడ్డు కృష్ణ, అల్లిక అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణ



మాట్లాడుతున్న రాధాకృష్ణ

నేలకొండపల్లి: కంప్యూటర్ ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కొత్తకొత్తూరు మాజీ సర్పంచ్ వల్లాల రాధాకృష్ణ సూచించారు. మండల కేంద్రంలో శ్రీ శ్వేత కంప్యూటర్ ఇన్‌స్టిట్యూట్ వారి ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన కంప్యూటర్ ఉచిత శిక్షణ కేంద్రాన్ని ఆదివారం ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రస్తుత పరిస్థితులలో కంప్యూటర్ పరిజ్ఞానం తప్పని సరిగా మారినందునఉచిత కంప్యూటర్ శిక్షణ తీసుకొని స్వయం ఉపాధి పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నేలకొండపల్లి మాజీ సర్పంచ్ రాయపూడి నవీన్, నిర్వాహకులు కిరణ్‌కుమార్, శ్వేత, గ్రామ పెద్దలు గఫార్, కడియాల నగేష్, గోళ్ల లక్ష్మీనారాయణ, కడియాల నరేష్ పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	మనమే
వినోద	గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి
సాయిరాం	సత్యభామ
ఆదిత్య	రక్షణ, బ్యాడ్ బాయ్స్
శ్రీనివాస	బాజే వాయు వేగం, నం.1
సుందర్	లవ్ మౌళి

- ఖమ్మంగాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	44	బచ్చలికూర	4
వంకాయ	20		20
బెండకాయ	20	పాలకూర	3
పచ్చిమిర్చి	80		20
కాకర	60	చుక్కకూర	3
బీర	50		20
దొండ	18	తోటకూర	4
పొట్లకాయ	40		20
చిక్కుడు	110	గోంగూర	4
గోరుచిక్కుడు	36		20
క్యాబేజీ	26	మెంతికూర	3
క్యాలీఫ్లవర్	26		20
ఆలుగడ్డ	34	కొత్తిమీర	1
చామగడ్డ	46		30
క్యారెట్	60	పుదీన	1
క్యాప్సికం	78		20

-ఖమ్మం వ్యవసాయం

నకిలీ సవాల్..!

ప్రసుత్త వానాకాలం పంట సాగుకు సన్నద్ధమవుతున్న రైతులు విత్తనాలు కొనేప్పుడు అప్రమత్తంగా ఉండాలి. విత్తన ఎంపికలో జాగ్రత్తలు పాటించకపోతే మొదటికే మోసం వచ్చే ప్రమాదముంది. రైతులు హడావుడిని ఆసరా చేసుకుని నకిలీ, నాణ్యత లేని విత్తనాలను అంటగట్టే పనిలో కొందరు వ్యాపారులుంటారు. విత్తనాలు కొనుగోలు చేయడమే తప్ప వాటి స్థితిగతులను గమనించకపోవడంతో రైతులు నష్టాల బారినపడే అవకాశం ఉంది. ఇలా జరగకుండా ఉండేందుకు అధికారులు విస్తృత తనిఖీలు, ముమ్మర ప్రచారాలు చేస్తున్నారు. మిరప, పత్తి, వరి, మొక్కజొన్న ఇతర పంటల విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో అప్రమత్తంగా వ్యవహరిస్తే లాభాల పంట పండించవచ్చని అధికారులు సూచిస్తున్నారు.

– కామేపల్లి/నేలకొండపల్లి

విస్తృత తనిఖీలు, ముమ్మర ప్రచారాలు

- విత్తన కొనుగోళ్లపై అధికారుల మార్గదర్శకాలు
- నకిలీ, నాణ్యత లేని విత్తనాలను అంటగట్టే ప్రయత్నంలో దళారులు
- అప్రమత్తత కలిగేలా అవగాహన సదస్సులు
- అమ్మేందుకు ముందుకు రాని దుకాణదారులు
- ఆంధ్రాకు తరలివెళ్తున్న రైతులు



నేలకొండపల్లి: విత్తన దుకాణాలను తనిఖీ చేస్తున్న ఏడీఏ విజయచంద్ర



కామేపల్లి: రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ, పోలీస్ శాఖాధికారులు

తక్కువ ధరలను నమ్మొద్దు..

వానాకాలం పంట సాగుకు రైతులు సిద్ధమవుతున్నారు. కామేపల్లి మండలంలో మిరప, పత్తి, వరి వంటి పంటలను అధికంగా పండిస్తుండగా.. పాలేరు నియోజకవర్గంలో నేలకొండపల్లి, కూసుమంచి, తిరుమలాయపాలెం, ఖమ్మం రూరల్ మండలాల్లో పత్తి పంటను సాగు చేస్తున్నారు. వానాకాలం సీజన్ ప్రారంభం కావడంతో రైతులు హడావుడిగా ఫర్టిలైజర్, అనుమతులు లేని కొందరి వద్ద విత్తనాలను కొంటుంటారు. ఇదే అదునుగా వ్యాపారులు, మధ్య దళారులు నకిలీ విత్తనాలను అంటగట్టేందుకు ప్రయత్నంలో తక్కువ ధరకు ఇస్తుండడంతో నాణ్యత లేని విత్తనాలైనా సరే రైతులు కొనుగోలు చేసేందుకు సిద్ధపడుతున్నారు. చిన్న చిన్న జాగ్రత్తలు పాటిస్తే నకిలీ విత్తనాల బారిన పడకుండా లాభాల సాగు చేయొచ్చని అధికారులు సూచిస్తున్నారు.

ఊరూరా తనిఖీలు, ముమ్మర ప్రచారాలు..

గతంలో వివిధ ప్రాంతాల నుంచి నకిలీ విత్తనాలు సరఫరా అవుతుండేవి. దీంతో రైతులు నకిలీ విత్తనాల బారిన పడకుండా ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకుంది. ఈమేరకు విత్తన దుకాణాలను ఎప్పటికప్పుడు వ్యవసాయ, పోలీస్, టాస్క్‌ఫోర్స్ అధికారులు తనిఖీలు చేపడుతున్నారు. డీలర్లు ప్రతీరోజు చేపట్టిన అమ్మకాల వివరాలను రికార్డుల్లో నమోదు చేయడం, స్టాక్ వివరాలు, రశీదు, ఎమ్మార్పీ మించి అమ్మకుండా చూడడం తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి విత్తన డీలర్లకు ఆదేశాలు జారీ చేస్తున్నారు. ఈ నేపథ్యాన నేలకొండపల్లి, కామేపల్లి మండలాల వ్యవసాయ, పోలీస్ శాఖ ఆధ్వర్యాన నకిలీ విత్తనాల బారిన పడకుండా గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించి ఏ సీజన్‌లో ఏ విత్తనాలు కొనుగోలు చేయాలి, ఏ మందులు వాడాలి, విత్తనాల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తున్నారు. అంతేకాక గ్రామాల్లో అనుమతి లేకుండా విత్తనాలు అమ్మితే వెంటనే తమకు ఇవ్వాలని సూచిస్తున్నారు. ఒక పక్క తనిఖీలు, మరో పక్క అవగాహన సదస్సులతో వ్యవసాయాధికారులు నిత్యం బిజీబిజీగా ఉంటున్నారు.

విత్తనాలు అమ్మేందుకు అనాసక్తి..

ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనప్పటికీ విత్తనాలను అమ్మేందుకు విత్తన దుకాణదారులు చాలామంది ముందుకు రావడం లేదు. లైసెన్స్ ఉన్నా అధికారుల తనిఖీలతో అసలు విత్తనాల అమ్మకాల జోలికే వెళ్లడం లేదు. తనిఖీల్లో ఏమైనా ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తుందేమో అని దుకాణాలకు తాళం వేసుకుంటున్నారని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. కనీసం పత్తి విత్తనాలను కూడా అమ్మకపోవడంతో పట్టణాలకు వెళ్లి విత్తనాలను కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని చెప్పొచ్చు.

ఆంధ్రాకు తరలుతున్న రైతులు..

అధికారుల విస్తృత తనిఖీలతో విత్తనాల అమ్మేందుకు దుకాణదారులు ముందుకు రావడం లేదు. దీంతో జిల్లాలోని అన్ని ప్రాంతాల నుంచి రైతులు ఆంధ్రాలోని గుంటూరు ప్రాంతానికి తరలివెళ్లి విత్తనాలను కొనుగోలు చేసేందుకు వెళ్తున్నారు. తెలంగాణలో విత్తనాల ధరలతో పోల్చితే ఆంధ్రాలో సగం ధరలకే లభిస్తుండడంతో ఎక్కువగా ఆంధ్రా వైపే మొగ్గు చూపుతున్నారు. అంతేకాక తెలంగాణలో లభించే బ్రాండ్లు కూడా ఆంధ్రాలో దొరకడంతో వేలాది రూపాయలు మిగులుతున్నాయని రైతులు అంటున్నారు.

నిరంతరం పర్యవేక్షిస్తున్నాం..



విత్తన దుకాణాలను నిరంతరం పర్యవేక్షిస్తున్నాం. విత్తనం, ఎరువులు, పురుగు మందులు, విక్రయాల గురించి దుకాణం ముందు బోర్డుపై ఉంచాలి. పూర్తి వివరాలు లేకుంటే కేసులు నమోదు చేస్తాం. రైతులు కొనుగోలు చేసిన ప్రతీ ప్యాకెట్‌కు రశీదు తీసుకోవాలి. ఇవ్వకపోతే నిర్వాహకులపై చర్యలు తీసుకుంటాం.

– ఎస్.విజయచంద్ర, ఏడీఏ, కూసుమంచి

అవగాహన ఉండాలి..



విత్తనాలపై రైతులు తప్పనిసరిగా అవగాహన ఉండాలి. లైసెన్స్ కలిగిన డీలర్ల వద్దనే విత్తనాలను కొనాలి. కొనుగోలు చేసిన ప్యాకెట్‌లో విత్తనాల మొలక శాతాన్ని విత్తక ముందే చూసుకోవాలి. కొనుగోలు చేసిన ప్యాకెట్లకు సంబంధించిన రశీదుతో పాటు ఖాళీ ప్యాకెట్లు కూడా పంట పూర్తయ్యే వరకు భద్రపర్చుకోవాలి.

– భూక్యా తారాదేవి, ఏఓ, కామేపల్లి

కామేపల్లిలో వరి విత్తనాల కొరత..

కామేపల్లి: ప్రభుత్వం సన్నరకాల ధాన్యానికి బోనస్ ఇస్తామని చెప్పడంతో రైతులు సన్నరకాల విత్తనాలను సాగు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. కానీ మండలంలోని రైతులకు విత్తనాలు సరిపడా దొరకడం లేదు. ఇప్పటికే జనుము, జీలుగు విత్తనాల కోసం నానా తంటాలు పడుతున్న రైతులకు కొత్తగా వరి విత్తనాల కొరత కూడా ఇబ్బంది పెడుతోంది. ఇటీవల కామేపల్లి సొసైటీకి బీపీటీ 5204 రకం విత్తనాలు సుమారుగా 120 క్వింటాళ్ల విత్తనాలు వచ్చినప్పటికీ అవి నాలుగు రోజుల క్రితమే అయిపోయాయి. అయినా ఇప్పటి వరకు సొసైటీకి విత్తనాలను సరఫరా కాలేదు. దీంతో రైతులు విత్తనాల కోసం కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. ఇప్పటికైనా విత్తనాల కొరతను తీర్చాలని రైతులు కోరుతున్నారు. కాగా, కొండాయిగూడెం సొసైటీ కార్యాలయంలో బీపీటీ 5204, పెసర విత్తనాలు అందుబాటులో ఉన్నాయని సొసైటీ చైర్మన్ ధనియాకుల హన్మంతరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఖమ్మంవ్యవసాయం/రఘునాథపాలెం: నగరంలోని 33/11 ఎన్ఎస్‌పీ సబ్ స్టేషన్ 11 కేవీ రాపర్తినగర్ పరిధిలో విద్యుత్ లైన్లకు ఆటంకంగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని టౌన్-3 ఏఈ తావుర్యా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో బైపాస్ రోడ్, ఆర్ఆర్ స్కూల్, కొత్త బస్టాండ్, రాపర్తినగర్ తదితర ప్రాంతాల్లో కరెంట్ ఉండదన్నారు. అలాగే నగరంలోని రమణగుట్ట 11 కేవీ ఫీడర్ మరమ్మతుల కారణంగా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని టౌన్-2 ఏఈ నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో వివేకానంద కాలనీ, రమణగుట్ట తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని చెప్పారు. వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు. అంతేకాక రఘునాథపాలెం మండలంలోని పంగిడి సబ్‌స్టేషన్‌లో మెయింటెనెన్స్ కారణంగా నేడు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని మంచుకొండ ఏఈ పోలూరు సతీష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు సబ్ స్టేషన్ పరిధిలోని దొనబండ ఫీడర్ పరిధిలోని వ్యవసాయ వినియోగదారుల కూడా సహకరించాలని కోరారు.

రామోజీరావు మృతికి టీయూడబ్ల్యూజే(టీజేఎఫ్) సంతాపం

ఖమ్మం మామిళ్లగూడెం: రామోజీ సంస్థల అధినేత, పద్మవిభూషణ్ రామోజీరావు మృతికి టీయూడబ్ల్యూజే(టీజేఎఫ్) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకుతోట ఆదినారాయణ, చిర్రా రవిలు ఆదివారం ఒక ప్రకటనలో సంతాపాన్ని ప్రకటించారు. దాదాపు ఐదు దశాబ్దాల పాటు జర్నలిస్టుగా, సినీరంగంలో రాణించి తెలుగు ప్రజల ఖ్యాతిని ఇనుమటింపజేశారని, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని వారు కోరారు.

కనీస వేతన చట్టాలు అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకన్న

కూసుమంచి: కార్మికులకు కనీస వేతన చట్టాలను అమలు చేయాలని ఇఫ్టూ జిల్లా కార్యదర్శి ఇరుగు వెంకన్న కోరారు. ఆదివారం కూసుమంచిలో నిర్వహించిన ఇఫ్టూ పాలేరు ఏరియా కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నేటి వరకు కార్మికులకు కనీస వేతన చట్టం లేదని, అట్టి చట్టాన్ని తక్షణమే అమలు చేయాలని, లేకుంటే పోరాటాలు తప్పవని హెచ్చరించారు. కార్మికులు ఎన్నో ఏళ్లుగా పోరాడి సాధించుకున్న తమ హక్కులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని పేర్కొన్నారు. కార్మికుల చట్టాల సవరణ పేరుతో కార్మికులను కట్టుబానిసలుగా మార్చేందుకు కుట్రలు చేసిందని, దీన్ని కార్మికులందరూ తిప్పికొట్టి చట్టాల సవరణను అడ్డుకునేందుకు పోరాటాలు సాగించాలన్నారు. కాంపాటి మధు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నాయకులు రమేష్, వెంకటేశ్వరరావు, నాగన్న, సురేష్, పవన్, అశోక్, బాటకృష్ణ, ఎన్డీ డివిజన్ కార్యదర్శి బజ్జూరి వెంకట్రామిరెడ్డి, చెరకుపల్లి వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

నీట్ ఫలితాలపై విచారణ జరిపించాలి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేష్

ఖమ్మంమయూరిసెంటర్: నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్(నీట్) యూజీ–2024 పరీక్షను సక్రమంగా నిర్వహించలేదని, విద్యార్థులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని, వెంటనే ఈ పరీక్ష నిర్వహణ, ఫలితాలపై విచారణ జరిపించి రద్దు చేయాలని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శులు వి.వెంకటేష్, మస్తాన్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన సంఘ ముఖ్య నాయకుల వేర్వేరు సమావేశాల్లో వారు మాట్లాడారు. గతంలో పరీక్ష ప్రశ్నాపత్రం లీకేజీ ఆరోపణలు జరగడం, ఇప్పుడు మార్కుల్లో అవకతవకలు, ఫలితాలలో 67 మంది విద్యార్థులకు ఫస్ట్ ర్యాంక్ రావడం, వారిలో ఎనిమిది మంది ఒకే కేంద్రం కావడం లాంటివి అనేక అనుమానాలకు తావిస్తుందని అన్నారు. నీట్ ఫలితాలను 14వ తేదీన విడుదల చేయాల్సి ఉండగా, లోక్‌సభ ఎన్నికల ఫలితాల రోజు విడుదల చేయడం ఏమిటని ప్రశ్నించారు. వెంటనే ఈ పరీక్షల నిర్వహణ, ఫలితాలపై విచారణ చేపట్టి, చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమాల్లో సంఘ జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్, సంఘ నాయకులు విష్ణు, స్టాలిన్, నరేందర్, రాకేష్, రామకృష్ణ, ఉదయ్, విష్ణు, భాను తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ పూర్వ విద్యార్థులు



కామేపల్లి: సమ్మేళనంలో నాటి గురువులతో పూర్వ విద్యార్థులు

ఖమ్మం సహకారనగర్: నగరంలోని ఎస్ఆర్అండ్ బీజీఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థులు (1989–1992 బ్యాచ్) నగరంలోని పీఆర్‌సీ భవనంలో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా నాటి బీఏ, ఈపీపీ, హెచ్‌ఈపీ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు నాటి స్మృతులను నెమరవేసుకున్నారు. ఇతర ప్రాంతాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు అంతా కలిసి ఆటపాటలతో అలరించారు. కరీంనగర్ జిల్లా ఫైర్ ఆఫీసర్ వెంకన్న జానపద నృత్యం, తెలంగాణ సినీ మ్యూజీషియన్ అసోసియేషన్ అధ్యక్షుడు బల్లేపల్లి మోహన్ పాటలు ఆకట్టుకున్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జెడ్పీ సీఈఓ చంద్రశేఖర్, ఏసీపీ రామానుజం, వివిధ జిల్లాల్లో ఉన్నత స్థానాల్లో ఉన్న నాటి పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

కామేపల్లిలో..

కామేపల్లి: మండలంలోని ముచ్చర్ల–జాస్తిపల్లి హైస్కూల్ పదో తరగతి (2004–05 బ్యాచ్) పూర్వ విద్యార్థులు ఆదివారం కామేపల్లిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకరికొకరు ఆత్మీయంగా పలుకరించుకుని యోగక్షేమాలను తెలుసుకుని ఆటపాటలతో సందడిగా గడిపారు. నాడు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

బీజేపీ శ్రేణుల సంబరాలు

ఖమ్మం మామిళ్లగూడెం: నరేంద్ర మోదీ దేశ ప్రధానిగా మూడవ సారి ప్రమాణ స్వీకారం చేస్తున్న సందర్భంగా నగరంలోని 26 డివిజన్‌లో బీజేపీ శ్రేణులు ఆదివారం రాత్రి స్వీట్లు పంపిణీ చేసి, బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మార్తి వీరభద్రప్రసాద్ మాట్లాడుతూ.. మోదీపాలనకు ప్రజలు బ్రహ్మరథం పట్టారని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు సూరివిష్ణు, శ్రీనివాసరావు, సోడి ధర్మేంద్ర, ఆకుల మురళి, దుర్గాగుల శివశర్మ, మారుతి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

'సర్వజ్ఞ' విద్యార్థి ప్రతిభ



చార్విక్‌ను అభినందిస్తున్న డైరెక్టర్లు

ఖమ్మం సహకారనగర్: తెలంగాణ స్టేట్ స్కూల్ గేమ్స్ ఫెడరేషనల్ స్పోర్ట్స్ జోనల్ పోటీల్లో తమ విద్యార్థి గొరిశెట్టి చార్విక్ టేబుల్ టెన్నిస్ అండర్–14, అండర్–17 విభాగంలో ప్రథమ బహుమతి సాధించినట్లు సర్వజ్ఞ పాఠశాల డైరెక్టర్లు ఆర్‌వీ నాగేంద్రకుమార్, నీలిమలు తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం పాఠశాలలో విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల సాధనకు ఉద్యమించాలి

ఖమ్మం మామిళ్లగూడెం: సమస్యల సాధన కోసం మహిళలు ఉద్యమించాలని వీరనారి సావిత్రిబాయిపూలే మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు పీఆర్ దేవి కోరారు. ఆదివారం ఖమ్మంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళలకు చట్టపరంగా రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. సమాజంలో మహిళలపై అత్యాచారాలు పెరిగిపోయాయని, మహిళలకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే అన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షురాలు మణి, చిప్ప సత్యావతి, అనంతలక్ష్మి, ఈశ్వరి, కె.లక్ష్మి, సునిత, వినోద, ధనలక్ష్మి, మంగమ్మ, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

విదేశాల్లోనూ ప్రాచీన కళలకు ఆదరణ

రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



చిన్నారులను అభినందిస్తున్న మంత్రి పొంగులేటి

ఖమ్మంవన్‌టౌన్: ప్రాచీన కళలకు ఎప్పటికీ ఆదరణ ఉంటుందని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. నటరాజ నృత్య కళానికేతన్ 48వ వార్షికోత్సవం సందర్భంగా వివిధ రాష్ట్రాలలో తమ నృత్య ప్రదర్శనలు చేసిన పలువురు చిన్నారులకు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు దక్కింది. ఈ సందర్భంగా వారిని మంత్రి పొంగులేటి తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాశ్చాత్య దేశాల్లో కూడా ప్రాచీన కళలకు ఆదరణ లభిస్తోందని అన్నారు. భారతదేశంలోనే కాకుండా ఇతర దేశాల్లోనూ కూచిపూడి, భరతనాట్యం, కథక్ తదితర కళల్లో మంచి ప్రాచుర్యం పొంది జాతీయ, అంతర్జాతీయ, రాష్ట్రస్థాయిలో విద్యార్థులు తమ ప్రతిభను చాటుకుంటున్నారని తెలిపారు. నటరాజ నృత్యకళానికేతన్ వ్యవస్థాపకుడు, మాస్టర్ మాధవరావు 48 ఏళ్లుగా వేలాది మంది చిన్నారులకు శిక్షణ ఇవ్వడం అభినందనీయమని, ఇదే ఒరవడిని కొనసాగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాధవరావుతో పాటు కార్పొరేటర్ దొడ్డా నగేష్, మేకల మల్లిబాబు యాదవ్, జర్నలిస్టులు రాంబాబు, యోగినాటి మాధవరావు, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పొంగులేటి నివాళి

కూసుమంచి: మండలంలోని పోచారం గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ రామసహాయం వెంకటరెడ్డి తల్లి పద్మమ్మ ఇటీవల మృతిచెందగా.. ఆదివారం రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆమెకు నివాళులర్పించి కుటుంబ సభ్యులకు సంతాపాన్ని తెలియజేశారు. మంత్రి వెంట నాయకులు మద్దినేని బేబీ స్వర్ణకుమారి, రామసహాయం నరేష్‌రెడ్డి, జూకూరి గోపాలరావు, జొన్నలగడ్డ రవికుమార్, అంజయ్య తదితరులు ఉన్నారు.

ప్రశాంతంగా గ్రూప్–1 ప్రిలిమ్స్..



ఖమ్మంరూరల్: అభ్యర్థులను తనిఖీ చేస్తున్న అధికారులు



ఖమ్మంమయూరిసెంటర్: ప్రయాణికులతో రద్దీగా మారిన ఖమ్మం పాత బస్టాండ్

ఖమ్మంరూరల్: మండలంలో ఆదివారం జరిగిన గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. పొన్నేకల్‌లో గల శ్రీచైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో మొత్తం 552 మంది అభ్యర్థులకు గాను 411 మంది పరీక్ష రాయగా, పెదతండాలోని ప్రియదర్శిని మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో 490 మందికి 387 మంది హాజరయ్యారు. అలాగే సత్యనారాయణపురంలోని డేర్ ఇంజనీరింగ్ కళాశాలలో 504 మందికి గాను 389 మంది అభ్యర్థులు పరీక్ష రాయగా 115 మంది గైర్హాజరయ్యారు. ఒక్క నిమిషం ఆలస్యం నిబంధనతో 9 గంటలకే ఆయా పరీక్షా కేంద్రాలకు అభ్యర్థులు చేరుకోగా వారిని అధికారులు తనిఖీ చేసి కేంద్రాల్లోకి పంపించారు.

కిటకిటలాడిన బస్టాండ్..

ఖమ్మంమయూరిసెంటర్: గ్రూప్–1 పరీక్ష నేపథ్యంలో ఇటు సాధారణ ప్రయాణికులు, అటు గ్రూప్–1 పరీక్ష రాసేందుకు వచ్చిన అభ్యర్థులతో ఖమ్మం కొత్త, పాత బస్టాండ్‌లు కిటకిటలాడాయి. కాగా, గ్రూప్–1 అభ్యర్థుల ప్రయాణానికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా బస్టాండ్‌ల నుంచి ఆర్టీసీ అధికారులు నగరానికి దూర ప్రాంతంలో ఉన్న పరీక్షా కేంద్రాలకు ప్రత్యేక బస్సులను తిప్పారు.

ఘనంగా గంగమ్మ జాతర



మొక్కులు చెల్లిస్తున్న గ్రామస్తులు

కామేపల్లి: మండలంలోని పండితాపురం గ్రామంలో యాదవ కులస్తులు గంగమ్మ జాతరను ఆదివారం అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మహిళలు బోనాలు ఎత్తుకొని ఊరేగింపుగా మేళతాళాలతో గ్రామ శివారులోఉన్న గంగమ్మ ఆలయం వద్దకు చేరుకుని బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని, పాడిపంటలు పండాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబుయాదవ్, మల్లికార్జున్‌రావు, మహేష్‌బాబు, లక్ష్మీనారాయణ, సోమబోయిన మల్లికార్జున్, చింతల వెంకయ్య, చిన్న వెంకటేశ్వర్లు, అరిపిన్ని వెంకటేశ్వర్లు, అల్లిక బక్కయ్య, కేతనబోయిన రాంబాబు, ఎర్రగడ్డ వెంకటేశ్వర్లు, ఉపేందర్, అర్వలాల్‌కృష్ణ, సోమయ్య, బాబు, అశోక్, తదితరులు పాల్గొన్నారు.